నూతన ధ్వజస్తంభానికి పూజలు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతన ధ్వజ స్తంభానికి సంప్రోక్షణ, విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. ఆదివాస హోమం, కుంభారాధన, హోమాలను జరిపారు. ఆగమ విద్వాన్ సత్యనారాయణాచార్యులు, ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షణలో వేదపండితులు పూజలు చేశారు. పూజలకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. ధ్వజ స్తంభ దాత కాకాణి నరహరిరెడ్డి, ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిపై గుడి – బడి

నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గుడి – బడి కార్యక్రమాన్ని ప్రణవ పీఠ శిష్య బృంద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణంలోని ప్రాంతాలను వారు శుభ్రం చేశారు. విష్ణు సహస్రపారాయణం, భక్తి గీతాలను ఆలపించారు. ప్రణవ పీఠ నిర్వాహకులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని ద్రౌపదీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో చండీ హోమాన్ని దేవస్థాన పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మద్దూరు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నవావరణ మంత్ర పఠనం, దుర్గా సప్తశతి పారాయణం, తదితరాలను జరిపారు. దేవస్థానంలో కొలువైన స్వామివారికి అభిషేకాలు, పూజలను వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సుమారు రెండు వేల మందికి ప్రసాదాలను అందజేశారు.

అందరూ సుఖసంతోషాలతో జీవించాలి

కృష్ణ ధర్మరాజస్వామి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో జీవించాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ కాంక్షించారు. చండీ హోమానికి హాజరైన ఆయన తొలుత స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అగ్నికుల క్షత్రియ సంఘ జిల్లా అధ్యక్షుడు నగిరి చంద్రశేఖర్, ఈఓ దర్గయ్య, దేవస్థాన కమిటీ చైర్మన్ సాదా నాగయ్య, కార్పొరేటర్లు మొగళ్లపల్లి కామాక్షిదేవి, కిన్నెర ప్రేమ్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తొమ్మిదో డివిజన్ ఇన్‌చార్జి వంగాల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కుంకుమార్చన



నెల్లూరు(బృందావనం): నగరంలోని కురువాడ లలితమ్మ కల్యాణ మండపంలో లలితా విష్ణుసహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు, వరలక్ష్మీ వ్రతాన్ని బాలాజీ నగర్ బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దాదాపు వంద మంది మహిళలు కార్యక్రమానికి హాజరయ్యారు. సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణమూర్తి, కాంతారావు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నేతలు కామేశ్వరప్రసాద్, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు సహకరించాలి



ట్రాఫిక్ సమస్యను పరిశీలిస్తున్న చలపతిరావు

కొడవలూరు : నార్తురాజుపాళెం అభివృద్ధిలో భాగంగా సెంటర్ లైటింగ్ పనులు జరుగుతున్నాయని, ట్రాఫిక్ విషయంలో ప్రయాణికులు సహకరించాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. నార్తురాజుపాళెంలో జరుగుతున్న లైటింగ్ పనులను ఎస్సై జి.సుబ్బారావుతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ సెంటర్ లైటింగ్ పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా రోడ్డు వేస్తున్న చోట వాహనాలను మరో వైపు మళ్లిస్తూ అడ్డుగా ఏదైనా ఏర్పాటు చేస్తే ద్విచక్ర వాహనదారులు వాటిని తొలగించి రోడ్డు వేస్తున్న మార్గంలోనే వెళ్తున్నారని, దీని వల్ల రోడ్డు పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని చెప్పారు. ధాన్యం లారీలను సైతం బొద్దువారిపాళెం మీదుగా వెళ్లాలని సూచించినా రోడ్డు వేస్తున్న మార్గంలోనే వస్తుండడం వల్ల ట్రాఫిక్ స్తంభించడంతో పాటు పనులకు అంతరాయం కలుగుతోందన్నారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా సెంటర్ లైటింగ్ పనులు చేపడుతున్నామని, ఇది త్వరగా పూర్తయ్యేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు కొండా శ్రీనివాసులురెడ్డి, నెలవాయి మాణిక్యరావు, ఎండీ కరిముల్లా, ఇసనాక సునీల్‌రెడ్డి, మారంరెడ్డి రంగారెడ్డి, తాటిపర్తి భాస్కర్, బొచ్చు శ్రీనివాసులు, సయ్యద్ రఫీ, పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య ఉన్నారు.

సీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న రమేష్

కోవూరు : కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం రాత్రి డీసీహెచ్‌ఎస్ (జిల్లా సామాజిక ఆరోగ్య కేంద్రాల కోఆర్డినేటర్) డాక్టర్ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న డాక్టర్ కౌశికను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యం మీద ప్రజలకు మరింత నమ్మకం కలిగే విధంగా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పని చేయాలని సూచించారు. అనంతరం రోగులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు.

దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే ప్రసన్న



కోవూరు : వెంకటాచలం మండలం, కసుమూరులో ఉన్న మస్తాన్‌వలీ దర్గాను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మతపెద్దల ఆశీర్వాదం పొందారు. ఎమ్మెల్యే వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి రావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని దామరమడుగు గ్రామానికి చెందిన కరకంబాకం శీనయ్య గొంతు కేన్సర్‌లో బాధపడుతూ నెల్లూరులోని కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ ఎస్.భువనశ్రీ నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లి శీనయ్యకు రూ.2,750ల నగదును అందజేశారు. దీంతో వలంటీర్ భువనశ్రీకి శీనయ్య ధన్యవాదాలు తెలిపారు.

కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని ఎఫ్‌సీఐ కాలనీ సమీపంలో గల షిర్డీ సాయిబాబా మందిర ప్రాంగణంలో నిర్మించనున్న మినీ కల్యాణ మండపానికి శంకుస్థాపనను మందిర ట్రస్టీ నాగిశెట్టి బాబురావు దంపతులు ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దాతల సహకారంతో పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. గాదంశెట్టి గోపాల్, పాదర్తి బాలాజీ, రాజా, పసుపులేటి రాజగోపాల్, యల్లాప్రగడ మాధవరావు, మేకల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు వినతి



మాట్లాడుతున్న ప్రసాద్

నెల్లూరు (టౌన్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ కోరారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంస్థ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. విద్యా పరిరక్షణకు గానూ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి మురళీధర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుపతయ్య, నాగిరెడ్డి, సురేంద్రబాబు, ఖాజావలీ, మోహన్‌ప్రసాద్, బాలరాగయ్య, షాహినాబేగం తదితరులు పాల్గొన్నారు.

జీడీఎస్ సంఘ మహాసభలు



నెల్లూరు(మినీబైపాస్): ఆలిండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ గ్రూప్ – సీ, జీడీఎస్ సంఘాల మహాసభలు.. పోస్ట్‌మెన్, ఎమ్టీఎస్ యూనియన్ నెల్లూరు డివిజన్ వర్కింగ్ కమిటీ సమావేశాలను నగరంలోని ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రూప్ – సీ సెక్రటరీగా రాజేష్, జీడీఎస్ సెక్రటరీగా పెంచలయ్య ఎన్నికయ్యారు. ఏపీ ఎన్జీఓ సెక్రటరీ నాయుడు వెంకటస్వామి, మార్కండేయులు, బీఎస్‌ఎన్‌ఎల్ నేత ఆంజనేయులు, ఏఐపీఈయూ రాష్ట్ర నేత శ్రీధర్‌బాబు, మురళి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడికి సత్కారం



నెల్లూరు(బృందావనం): పలు రంగాలకు సేవలందిస్తున్న కళాకారుడు అంజద్‌బాషాను ఆదివారం సత్కరించారు. లస్సీ సెంటర్ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో కేతా సుబ్బారావు, మురళీమోహన్‌రావు, రాయప్ప, దోస్త్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఓసీసీఐ కమిటీ సభ్యుల నియామకం



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(మినీబైపాస్): ఓడ్ కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఓసీసీఐ) జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నామని రాష్ట్ర అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. జిల్లా ప్రెసిడెంట్‌గా చంద్రగిరి రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా నిరంజన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్‌గా సూరా కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గణేష్‌ను నియమించామన్నారు. గుంజి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

17న పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న మధుసూదన్

నెల్లూరు(మినీబైపాస్): గండిపాళెంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఈ నెల 17న నిర్వహించనున్నామని డాక్టర్ మధుసూదన్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జయరాములు, సురేష్, రమేష్, గోపీ, చెన్నయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

వినాయకుడి ఆలయంలో పూజలు



నెల్లూరు రూరల్: పొట్టేపాళెంలో జీర్ణోద్ధరణ పూర్తి చేసుకున్న వరసిద్ధి వినాయక ఆలయంలో మహా కుంభాభిషేక విశేష పూజలను వేడుకగా ఆదివారం నిర్వహించారు. మూషిక వాహనంపై వినాయకుడికి గ్రామోత్సవాన్ని జరిపారు. అనంతరం అన్నదానం చేశారు. భక్తులు భారీగా హాజరయ్యారు.

గురుపూజోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పింఛనర్ల సంక్షేమ సంఘ భవనంలో గురుపూజోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నామని స్టేట్ గవర్నమెంట్ పింఛనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్, ఎస్వీపీఎస్ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 మంది విశ్రాంత ఉపాధ్యాయ పింఛనర్లను సత్కరించనున్నామని వివరించారు. కార్యక్రమానికి పింఛనర్లు హాజరు కావాలని కోరారు.

విద్యా సంస్థల మనుగడకు అమ్మఒడి



ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చంద్రశేఖరరెడ్డి

ఆత్మకూరు: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల మధ్య విద్యాభివృద్ధిలో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని, అప్పుడే విద్యా ప్రమాణాల స్థాయి పెరుగుతుందని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికే కాకుండా ప్రైవేట్ విద్యా సంస్థల మనుగడకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని, అందులో భాగమే అమ్మఒడి పథకం అందరికి వర్తింపజేస్తున్నారన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల అసోసియేషన్ (అపస్మా) ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఎమ్మెల్సీ పి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తుందన్నారు. నాడు–నేడు పథకంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది పాఠశాలలు ఆధునికీకరింపబడి విద్యకు మంచి వాతావరణం ఏర్పడిందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల వల్ల ప్రభుత్వానికి భారం తగ్గడమే కాకుండా ఎందరో ఉపాధ్యాయులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు, సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి ఎమ్మెల్సీగా తన సహకారం ఎప్పుడూ ఉంటుందని ఇప్పటికే పలువురికి తన వంతు సహకారం అందించానన్నారు. అనంతరం ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేస్తూ మంచి పేరు సంపాదించిన పలువురు ప్రైవేట్ ఉపాధ్యాయులను ఆపస్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీని అపస్మా నిర్వాహకులు సన్మానించారు. డిప్యూటీ డీఈఓ రఘురామయ్య, ఎంఈఓ ఎస్‌కే నజీర్ బాషా, అపస్మా కార్యవర్గ సభ్యులు సీవీ రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, టీసీవీ సుబ్బయ్య, డి ప్రభాకర్, ఈ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కళారంగానికి నిలయం సింహపురి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): కళారంగానికి సింహపురి నిలయమని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మైండ్ గేమ్ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సంబంధించిన పోస్టర్లను గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. వీఆర్సీ మైదానంలో ఈ నెల పదిన నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రముఖ హీరోయిన్ కామ్నా జెత్మలానీ, సీరియల్ నటులు స్వాతి చౌదరి, స్వప్న, తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. ప్రతిభ గల కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. నిర్మాత, దర్శకులు శ్రీలక్ష్మి, కిషోర్ శ్రీకృష్ణ, హీరో శ్రీరామ్, మురళి, వాసు, 25 కళాసంఘాల కన్వీనర్లు అమీర్‌జాన్, హరనాథ్‌రెడ్డి, దోర్నాల హరిబాబు, ఈవెంట్ ఆర్గనైజర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో ఆర్థికాభివృద్ధి



కనుపూరులో కలంకారి యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : ఏ రంగంలోనైనా నైపుణ్యం సాధిస్తేనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కనుపూరు గ్రామంలో చిట్టిబాబు దంపతులు నెలకొల్పిన కలంకారి చీరల యూనిట్‌ను మంత్రి కాకాణి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం వెంకటాచలంలో కలంకారి శిక్షణ కార్యక్రమాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించామని, ఆ కార్యక్రమంలో శిక్షణ పొందిన చిట్టిబాబు దంపతులు నేడు పది మందికి ఉపాధి కల్పించేలా కలంకారి యూనిట్‌ను నెలకొల్పడం స్ఫూర్తిదాయకమన్నారు.

ఈ యూనిట్ ద్వారా ఉత్పత్తి అయ్యే కలంకారి చీరలు జిల్లా నలుమూలలకు చేరాలని ఆకాంక్షించారు. మరుగున పడిపోతున్న కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల వైస్ ఎంపీపీ పచ్చబట్ల మస్తానయ్య, సర్పంచ్ నాటకం శ్రీనివాసులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పదేళ్ల పింఛన్ కల సాకారం



అల్లూరు: పదేళ్లుగా పింఛన్ కోసం చేసిన పోరాటం నేడు ఫలించడంతో ఆమె కళ్లు ఆనందంతో తడిసిపోయాయి. స్థానిక బీసీ కాలనికి చెందిన షేక్ మునిర్ జాన్ (40) పదేళ్ల క్రితం బ్రెయిన్ వ్యాధి కారణంగా మానసిక దివ్యాంగురాలైంది. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆమె కుటుంబ సభ్యులు కార్యాలయాల చుట్టూ తిరిగితిరిగి వేసారి పోయారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఆమెకు పింఛన్ మంజూరుకు ప్రయత్నించగా రేషన్ కార్డులో టెక్నికల్ సమస్య రావడంతో తన వలంటీర్ షేక్ నాజియా రేషన్ కార్డులో తలెత్తిన సమస్యను పలు దఫాలుగా పరిష్కరించేందుకు కృషి చేశారు. ఆ సమస్య పరిష్కారం కావడంతో తాజాగా పింఛన్లు మంజూరు కావడంతో రూ.3 వేల ఆదివారం తన ఇంటికే వచ్చి అందించడంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయింది. కార్యక్రమంలో సచివాలయం–1 కన్వీనర్ షేక్ జంషీర్, నాయకులు షేక్ రసూల్ పాల్గొన్నారు.

‘నాటు’పై మక్కువ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మారుతున్న జీవనశైలితో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతుండటంతో ఆహార అలవాట్లపై ప్రజలు మక్కువ చూపుతున్నారు. ధర ఎక్కువైనా ఆరోగ్యానికి మేలు చేస్తాయనే ఉద్దేశంతో నాటు పక్షుల మాంసంపై నగర వాసులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. మూలాపేట సమీపంలోని రోడ్డు మార్గంలో సంతను ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు తాము పెంచుకుంటున్న నాటు కోళ్లు, బెరస కోళ్లు, గిన్నె కోళ్లు, టర్కీ కోళ్లతో పాటు కముజులు, పావురాళ్లు, కుందేళ్లను తీసుకొచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. ధర ఎక్కువగా ఉన్నా, ఆరోగ్యానికి ఎలాంటి సమస్య లేకపోవడంతో వీటిని కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. కిలో బరువున్న నాటు కోడి రూ.400 వరకు, టర్కీ కోడి రూ.మూడు వేల వరకు పలుకుతోంది. కాగా వీటిని కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది.





